నీటి వృథాను అరికట్టండి

మణికొండ: గండిపేట నుంచి నగరానికి నీటిని తరలిస్తున్న క్యాండూట్‌కు పలు చోట్ల లీకేజీలు ఏర్పడి నీరంతా వృథా అవుతోందని.. నీటి వృథాను అరికట్టాలని మణికొండ మున్సిపల్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ఆధ్వర్యంలో గురువారం వృథా అవుతున్న ప్రాంతాలను పరిశీలించారు. మరమ్మత్తులు చేపట్టకపోవటం వల్లే ఈసమస్య వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘాంసిమియాగూడలో పోషణ మాసం ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: ఘాంసిమియాగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం ఉత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ శాంతి మాట్లాడుతూ.. కిశోర బాలిక వయస్సు నుంచి పోషకాలు, విటమిన్స్‌తో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబికా పాల్గొన్నారు.

'బీసీ బంద్‌కు మద్దతిస్తాం'

రాజేంద్రనగర్: బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ తలపెట్టిన బంద్‌కు సంపూర్ణమద్దతు ఇస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవ కమిటీ అధ్యక్షులు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్ వెల్లడించారు. శివరాంపల్లిలో గురువారం మాట్లాడుతూ... 18వ తేదీన నిర్వహించనున్న బంద్‌లో ప్రతి బీసీ నాయకుడు కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే కమిటీ సభ్యులతో పాటు సర్కిల్‌కు చెందిన బీసీ నాయకులంతా ఈ బంద్‌తో శాంతియుతంగా పాల్గొననున్నట్లు వెల్లడించారు.

రాజశ్రీ కోళ్ల పెంపకంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఏజీవర్సిటీ: పీవీ నర్సింహరావు పశువైద్య విశ్వవిద్యాలయంలో గురువారం రాజశ్రీ కోళ్ల పెంపకంతో గ్రామీణ ప్రజలకు ఉపాధి అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్య విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి డాక్టర్ ఎం కిషన్ కుమార్ కోళ్ల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు గ్రామీణ మహిళలకు ఆర్థిక అభివృద్ధి పై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలొ డాక్టర్ కృష్ణ, డాక్టర్ అనిల్,డాక్టర్ మాదురీ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని కబ్జాచెర నుంచి విడిపించండి

శంషాబాద్ : రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అక్రమార్కుల కబ్జా నుంచి తమ భూమిని విడిపించాలని మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడకు చెందినగుంటి బాలయ్య వారసులు గురువారం శంషాబాద్ తహసీల్దార్ రవీందర్‌దత్‌కు వినతి పత్రం సమర్పించారు. హైకోర్టులో ఇరువైపు ఉన్న అంశాలను పరిశీలించిన న్యాయస్థానం తమ ప్రత్యర్థులు వేసిన రిట్‌పిటిషన్‌ను కొట్టివేసిందన్నారు.కోర్టు తీర్పు తర్వాత కూడా కబ్జా నుంచి వెళ్లని అక్రమార్కులకు ఖాళీ చేయించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

గచ్చిబౌలి: రోడ్డు భద్రతలో భాగంగా విద్యార్థులకు వినూత్న రీతిలో గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. గురువారం విప్రో జంక్షన్‌లో గచ్చిబౌలి స్కూల్, కేంబ్రిడ్జ్ స్కూల్ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. జంక్షన్‌లో ట్రాఫిక్ క్రమ శిక్షణ, ప్రాథమిక ట్రాఫిక్ నిర్వాహణను వివరించారు. సిగ్నల్స్ పనితీరు, జంక్షన్లు, రోడ్లపై ఉన్న గుర్తులను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పాదాచారుల భద్రతను వాహదారులు గుర్తించాలన్నారు.

బేగంపేట సీజీహెచ్‌లో సీపీఆర్‌పై ఉచిత శిక్షణ



సాక్షి, సిటీబ్యూరో: సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా గురువారం బేగంపేటలోని సీజీహెచ్ఎస్‌లో సీపీఆర్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సెయింట్ జాన్ అంబులెన్స్ డైరెక్టర్ వీవీవీఎస్ మూర్తి, సెక్రటరీ డాక్టర్ ఎం.మహేంద్ర కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గుండె సంబంధిత అత్యవసర సమయంలో ఎలా వ్యవహరించాలో అక్కడి సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. సెయింట్ జాన్ అంబులెన్స్ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యురాలు డాక్టర్ సవిత ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఆకస్మిక గుండెపోటు సంకేతాలను ఎలా గుర్తించాలో కూడా వివరించినట్టు తెలిపారు.

కొత్త భవనానికి తుది మెరుగులు



తుది మెరుగులు దిద్దుకుంటున్న మణికొండ మున్సిపల్ కార్యాలయం

ఆధునిక హంగులతో మున్సిపల్ కార్యాలయం
రూ.21 కోట్లతో నిర్మాణం
నవంబర్‌లో ప్రారంభోత్సవం

మణికొండ: గ్రామ పంచాయతీల వ్యవస్థ నుంచి మున్సిపాలిటీగా మారిన ఆరు సంవత్సరాల పాటు మణికొండ మున్సిపల్ కార్యాలయం చాలీచాలని భవనాల్లో కొనసాగింది. మణికొండ పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో కొన్ని నెలలు, పుప్పాలగూడ మహిళా సమాఖ్య భవనంలో ఐదు సంవత్సరాల పాటు ఉంది.దీంతో కొత్త కార్యాలయం ఆవశ్యకతను వివరిస్తూ మూడు సంవత్సరాల క్రితం అప్పటి పాలక కమిటీ తీర్మాణం చేసి సరైన స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు పంపారు. దాంతో సర్వే నెంబర్ 265లోని 30 గుంటల ప్రభుత్వ భూమిని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించారు. మొత్తం రూ. 21 కోట్లతో భవనం సిద్ధమవుతోంది.

నవంబర్‌లో ప్రారంభోత్సవం..

మున్సిపల్ కార్యాలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవటంతో ఈ నెలాఖరులోపు పూర్తి చేసి నవంబర్‌లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఇంచార్జి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి కాగానే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పరిశీలించి మంత్రి సమయాన్ని తీసుకుని వచ్చే నెలలో ప్రారంభింప చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. అలాగే మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ.100 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పందెన్‌వాగు పునరుద్ధరణ, సుందరీకరణ పనులను ఐటీ మంత్రితోనే శంకుస్థాపన చేయించాలని అధికారులు భావిస్తున్నారు.



సిద్ధమైన రెవెన్యూ విభాగం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కవిత

అత్తాపూర్: పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలను తెలుసుకొని ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ టీచర్లు షమీమ్‌బేగం, శాంతాకుమారిలు అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని భూపాల్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు, విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్, రక్తహీనత, అధిక బరువు తదితర వాటిని వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

బండ్లగూడ: ప్రోటీన్, విటమిన్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని శేరిలింగంపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కవిత అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్‌లోని కస్తూర్బా పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలవేణి, రేణుక, నార్సింగి మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

21న సదర్ సందడి

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామంలోని శివాలయం వద్ద ఈ నెల 21న రాత్రి 9 గంటలకు బుద్వేల్ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ మహాసభ యాదవ సదర్ నిర్వహించనున్నట్లు తెలంగాణ అఖిల భారత యాదవ మహాసభ ఉపాధ్యక్షులు, రంగారెడ్డి జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నరేశ్ యాదవ్ అన్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ జాతర, దున్నపోతుల ఊరేగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను అందజేసిన పోలీసులు



శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సెల్‌ఫోన్ ప్రయాణికుడికి ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు అందజేశారు. ప్రయాణికుడు ఉడిపి హోటల్ వద్ద ఫోన్ పాగొట్టుకున్నట్లు ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ పరిశీలించిన పోలీసులు గుర్తించి ప్రయాణికుడికి అందజేశారు. పోలీసులు కేవలం గంట వ్యవధిలోనే ఫోన్‌ను గుర్తించి అందజేయడం పట్ల ప్రయాణికులుకు సంతోషం వ్యక్తం చేశాడు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



శివకుమార్ మృతదేహం

మణికొండ: కాసేపట్లో ప్రారంభించాల్సిన జిమ్ వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్న ఇద్దరు ఎలక్ట్రీషియన్లకు విద్యుత్ ప్రమాదం జరగటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.ఈ సంఘటన గురువారం రాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు.. గంధంగూడ హిమగిరినగర్ కాలనీకి చెందిన శివకుమార్,(25), గుడిమల్కాపూర్‌కు చెందిన శివలు హైదర్‌షాకోట్‌లో గురువారం రాత్రి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ చేతులమీదుగా ప్రారంభించాల్సిన జిమ్ వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ క్రమంలో లైట్లను బిగించేందుకు ఓ ఇనుప పైప్ పైకి ఎత్తటంతో అది విద్యుత్ వైర్లకు తగిలింది. దాంతో దాన్ని పట్టుకుని ఉన్న శివకుమార్, శివలు కింద పడిపోయారు. శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, శివను హుటాహుటిన లంగర్‌హౌస్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం విషయం తెలుసుకుని మృతుని కుంటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకోవటంతో గందరగోళం ఏర్పడింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. జిమ్ ఓనర్ రాకేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 'బస్తీ బాట'



బస్తీ బాటలో విద్యుత్ శాఖ సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ తదితరులు

గోల్కొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'బస్తీ బాట'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని ఓయూ కాలనీ దాన్ని పరిసరాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు తదితర వాటిని పరిశీలించారు. వినియోగదారులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పనితీరుపై కూడా ఆయన ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ డైరెక్టర్ నర్సింహులు, సీఈ ప్రభాకర్, ఎస్ఈ సెంట్రల్ వెంకన్న, మెహిదీపట్నం డివిజన్ డీఈ సుధీర్, ఏడీఈ గోల్కొండ డివిజన్ ఎం.మాధవరావు, షేక్‌పేట్ డివిజన్ ఏఈ మహ్మద్ జాఫర్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'స్టెమ్‌ల్యాబ్' ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో ఆప్టమ్‌ఇండియా, హోప్ ఫౌండేషన్, విద్యాకమిటీ సభ్యులు, టీచర్లు

రాయదుర్గం: ఆప్టమ్ ఇండియా, హోప్ ఫౌండేషన్ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్టెమ్ ల్యాబ్'ను గురువారం రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఆప్టమ్ ఇండియా ప్రతినిధి నితిన్ కశ్యప్, శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య ప్రారంభించారు. దీంతో పాటు స్మార్ట్ టీవీ, అన్ని తరగతులకు కావాల్సిన కాంటెంట్‌ని కూడా అందించారు. దీనిలో భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం సంబంధించిన అన్ని ప్రయోగాలకు కావాల్సిన పరికరాలు, మోడల్, రసాయనాలు, కాంటెంట్ చార్ట్‌లు ఉన్నాయి. ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ ఎన్‌జీఓ సంస్థలకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం హర్షణీయమన్నారు.

రోడ్లు అస్తవ్యస్తం.. ప్రయాణం నరకం



మాదాపూర్‌లోని గఫూర్‌నగర్‌లో..



దుర్గం చెరువు వద్ద ..

మాదాపూర్‌లో ఇదీ పరిస్థితి

మాదాపూర్: అంతర్జాతీయ సదస్సులకు, ఐటీ ప్రాంతాలకు నిలయంగా ఉన్న మాదాపూర్ ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. లక్షల రూపాయలను వెచ్చించి పనులను చేపట్టినప్పటికీ నాణ్యతా లోపం వల్ల ప్రయోజనం లేకుండా పోతోంది. మరమతులు చేసిన కొద్ది రోజులకే తిరిగి గుంతల మయంగా మారుతున్నాయి. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మాదాపూరోని గఫూర్ నగర్, సాయినగర్, శ్రీ వేంకటేశ్వర కళాశాల పరిసర ప్రాంతాలలో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. అధికారులు ఇప్పటికైనా పట్టించుకొని రోడ్లకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

'రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీతో విసిగిపోయారు'

చార్మినార్: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీతో విసిగిపోయారని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టకుండా.. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పొడుతోందన్నారు. అందుకే మైనార్టీ నాయకుడు అలీ మస్కతి సైతం పార్టీకి గుడ్ బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారన్నారు. అలీ మస్కతి పార్టీలో చేరడాన్ని తాను మన స్ఫూర్తిగా స్వాగతిస్తున్నానన్నారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నియోజకవర్గం ప్రజలు తమ పార్టీ అభ్యర్థినే గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీహార్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం హైదరాబాద్ ఎంపీ అక్కడి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి లేఖ రాయగా..తిరస్కరించారని. ఇక్కడ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలియజేయడం గమనార్హమన్నారు. ఇక్కడ కాంగ్రెస్‌తో దోస్తానా చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీని బీహార్ కాంగ్రెస్ ఛీ కొడుతోందన్నారు.

వంతెనపై చెత్తను తొలగించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: గండిపేట చెరువు గేట్లు ఎత్తటంతో మూసీనదిలోని చెత్తా, చెదారం కొట్టుకుని వచ్చి మంచిరేవుల గ్రామానికి వెళ్లే వంతెనకు అడ్డుగా నిలిచిందని, దాన్ని తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డిని కోరారు. పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కమీషనర్‌ను గురువారం కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. చెత్తను తొలగిస్తే ప్రజల రాకపోకలకు ఇబ్బంది తొలుగుతుందన్నారు. మైనార్టీ విభాగం నియోజకవర్గ ఇంచార్జి ముక్తార్‌పాష పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్ రూరల్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ట్రాఫిక్ ఏసీపీ పి.నాగభూషణం అన్నారు. పాల్మాకులలో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. చౌరస్తాలో బెంగళూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మానాజీపేట్ రమేశ్ గౌడ్

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రభుత్వ స్కూల్ పక్కన ఉన్న బీసీ హాస్టల్‌లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మానాజీపేట్ రమేశ్ గౌడ్ పేర్కొన్నారు.ప్రభుత్వం పేరుకు మాత్రమే ఏకలవ్య స్కూల్ అంటూ నిరుపేద విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీ చేయగల వారిగా తీర్చిదిద్దుతామని చెబుతుండగా ఆ విద్యార్థుల కడుపులు నింపే పరిస్థితి కూడా లేకపోవడం శోచనీయమన్నారు. మెనూ ప్రకారం ఇవ్వాల్సిన గుడ్డు, రాగి జావ, మజ్జిగ ఇవ్వడం లేదని.. ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల చికెన్ ఇవ్వాల్సిన చోట 70 గ్రాముల చికెన్ మాత్రమే పెడుతున్నారని తెలిపారు. హస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం నాయకులు స్వయంగా సందర్శించి పూర్తిగా తనిఖీ చేసినట్లు రమేశ్ గౌడ్ వెల్లడించారు. హస్టల్ వార్డెన్ వారానికి రెండుసార్లు మాత్రమే వచ్చి విద్యార్థులు సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. విద్యార్థుల హక్కుల కోసం ఏ స్థాయిలోనైనా పోరాటం చేస్తామని రమేశ్ గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మంచాల లక్ష్మణ్‌తో పాటు అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లేకపోతే చర్యలు



క్రికెట్ స్టేడియం పనులను పరిశీలించిన ప్రత్యేకాధికారి

మణికొండ: మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పూర్తి స్థాయి నాణ్యత ఉండాలని, లేకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని మణికొండ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న క్రికెట్ స్టేడియం, సీసీ రోడ్లు నిర్మాణ పనులను కమిషనర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా క్రికెట్ స్టేడియం పనులు ఆలస్యం కావటంపై ఆయన కాంట్రాక్టర్‌ను మందలించారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు.

తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు



కార్వాన్ బీసీ ఐక్యవేదిక సమావేశం

గోల్కొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఇచ్చిన తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని కార్వాన్ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొల్లూరి అనిల్‌కుమార్ అన్నారు. బంద్‌కు మద్దతు తెలిపేందుకు గురువారం గుడిమల్కాపూర్‌లో బీసీ ఐక్యవేదిక కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ..బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సమంజసమే అని ఈ రిజర్వేషన్‌తో రాజకీయంగా బీసీలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 18న జరిగే బంద్‌కు కార్వాన్ నియోజకవర్గంలోని విద్యా సంస్థలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా పాల్గొని ఇంత వరకు అన్యాయానికి గురవుతున్న బీసీలకు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు అడిగే మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పంబి శ్రీనివాస్‌తో పాటు సోమాని వెంకటేష్, ఆకుల గోవర్థన్, యశ్వంత్‌చారి తదితరులున్నారు.

పాతబస్తీలో అమీన్ పటేల్ పర్యటన

చార్మినార్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమించడానికి గురువారం పాతబస్తీని సందర్శించిన ఏఐసీసీ అబ్జర్వర్ అమీన్ పటేల్ పలువురు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. దూద్‌బౌలి, కిషన్‌బాగ్, ఫలక్‌నుమా, రామ్నాస్‌పురా డివిజన్లలో పర్యటించి ప్రతి కాంగ్రెస్ నాయకునితో, కార్యకర్తతో డీసీసీ అధ్యక్షుని ఎంపికలలో వారి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వలి ఉల్లాహ్ సమీర్, కాంగ్రెస్ నాయకులు కన్నయ్య లాల్, ఇక్బాల్, జబ్బార్, మీర్ మహమ్మద్, డివిజన్ అధ్యక్షుడు భాను యాదవ్, నజీర్ ఖాన్, ఇర్ఫాన్, బారి ఖాన్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.